
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 డిసెంబరు 2024



ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● జెడ్‌బీఎన్‌ఎఫ్ డీపీఎం ఎస్వీ ప్రవీణ్‌కుమార్



ముఖాముఖి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చు. ఈ విధానం వల్ల ప్రకృతిలోని వనరులు వినియోగించడం వల్ల వ్యవసాయంలో పెట్టుబడుల ఖర్చు కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాలపై రైతుల్లో అవగాహన తీసుకువచ్చేందుకు జీరో బేస్డ్ నాన్ పెస్టిసైడ్ డీపీఎం ఎస్వీ ప్రవీణ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో పలు విషయాలు మాట్లాడారు.

ప్రశ్న: ప్రకృతి వ్యవసాయం అంటే ఏమిటి?

జవాబు: ప్రకృతిలో సహజసిద్ధంగా మనకు లభించే ఆవు పేడ, మూత్రంతో కలిపి చేసే వ్యవసాయమే ప్రకృతి వ్యవసాయం.

ప్రశ్న : ఈ విధానంలో వ్యవసాయం ఎందుకు చేయాలి?

జవాబు: ప్రస్తుతం రైతులు చాలా వరకు వ్యవసాయం మీద ఖర్చులు ఎక్కువ పెడుతున్నారు. దీంతో పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తగ్గుతుంది. విచక్షణా రహితంగా రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూమి సారవంతం తగ్గుతుంది. వీటి నుంచి రైతు బయటపడి వ్యవసాయాన్ని లాభదాయకం చేసుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రశ్న: ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలు ఏమిటి?

జవాబు: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. ఖర్చులు తగ్గుతాయి. దిగుబడి పెరుగుతుంది. నాణ్యమైన ఉత్పత్తులు రావడం వల్ల వినియోగదారులకు కూడా మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఏక పంటలు కూడా పలు రకాల పంటలు సాగు చేయడం వల్ల కలుపు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉండదు.

ప్రశ్న: జిల్లాలో దీని అమలు విధానం ఎలా ఉంది ?

జవాబు: ఈ ఏడాదికి 72,176 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలనేది లక్ష్యం. ఇందులో 49,812 మందితో ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం చేయించాం. ప్రస్తుత రబీ సీజన్‌లో 22,364 మంది రైతులతో చేస్తున్నాం.

ప్రశ్న: ఏఏ పంటలు సాగవుతున్నాయి?

జవాబు: వరి, పసుపు, అరటి, చీనీ, మిరప, మొక్కజొన్నతో పాటు వివిధ పంటల్లో అంతర పంటలు సాగవుతున్నాయి.

ప్రశ్న: మార్కెటింగ్ ఎలా ఉంది..

జవాబు: సాధారణంగా రైతులు రసాయనేతర ఎరువులతో సాగు చేసే పంటల వల్ల వచ్చే ఉత్పత్తులతో పోషక విలువలు తగ్గుతున్నాయి. ఈ తరుణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉంది. స్థానికంగా ఎక్కువ మంది కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

కడప గడపలో.. ఇసుక టెండర్ల సెగ

● బిడ్ ఓపెన్ చేయకుండా తవ్వకాలకు యత్నం
● ఇసుక దోపిడీకి పక్కా స్కెచ్
● తక్కువ ధరకే కోట్
● సొంత ఆదాయం కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న తమ్ముళ్లు



చక్రాయపేట మండలంలో వెళుతున్న టిప్పర్లు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గాడి తప్పిన రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఒకవైపు సీఎం చంద్రబాబునాయుడు తన శక్తియుక్తులు ప్రదర్శిస్తున్నారు. కానీ కూటమి నేతలు మాత్రం వైసీపీ బాటే పడుతున్నారు. ఇప్పటికే మద్యం వ్యాపారాల్లో సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమ రవాణా, గ్రావెల్ దందా చేస్తూ గత ప్రభుత్వానికి ఏం తీసిపోమన్నట్లుగా కొందరు ఉన్నారు. ప్రస్తుతం కడప గడపలో.. ఇసుక టెండర్ల సెగ రాజుకుంటోంది. బిడ్ ఓపెన్ చేయకుండానే తవ్వకాలకు యత్నిస్తున్నారు. తక్కువ ధరకే కోడింగ్ చేస్తూ ఇసుక దోపిడీకి పక్కా స్కెచ్ వేశారు. ఇలా చేసే గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది. 11 సీట్లు మాత్రమే కట్టబెట్టి పార్టీని కోలుకోని విధంగా తొక్కిపడేశారు. జిల్లావాసులు వైసీపీని వ్యతిరేకించి కూటమిపై కోటి ఆశలతో ఓట్లు గుమ్మరించారు. అయితే వైసీపీ నేతల దారిలోనే జిల్లాలో కొందరు కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శ ఉంది. సీఎం చంద్రబాబునాయుడు ఇసుక, మద్యం భూకబ్జాల ఇతర అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లకూడదని పదే పదే చెబుతున్నా కూటమి నేతలకు చెవికెక్కడం లేదు. వైసీపీకి ఏం తీసిపోమన్నట్లుగా కొందరు ఉన్నారు. ఇక కూటమి నేతలను నడిపించే నాయకుడే లేడు. వీరి మధ్య సఖ్యత లేదనేది జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో ఇసుక కోసం మైనింగ్‌శాఖ నిర్వహించిన టెండర్లలో కూడా కాక రేపుతున్నాయి. ఏదైనా టెండరు వేసినా అందులో లోటుపాట్లను ప్రతిపక్షం ఎత్తిచూపాలి. అయితే ఇప్పుడు టెండరు వ్యవహారంలో టీడీపీ నేతలే అభ్యంతరాలు చెప్పడం గమనార్హం. కొందరు టీడీపీ నేతలు వైసీపీ నేతలతో కలిసి ఇసుక టెండర్లలో గోల్‌మాల్‌కు తెర లేపారని చెబుతున్నారు. పేకాట పేకాటే.. తమ్ముడు తమ్ముడే అన్నట్లుగా, పొలిటికల్ పొలిటికలే.. డబ్బు డబ్బే అన్నట్లు జిల్లాలో కొన్ని చోట్ల టీడీపీ, వైసీపీ నేతలు కలిసిపోయారంటారు. ఇప్పుడు కొందరు ఎమ్మెల్యేల చుట్టూ ఉన్న హార్డ్‌కోర్ టీడీపీ నేతల కన్నా వైసీపీ నేతలదే హవా నడుస్తుందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇసుక కోసం నిర్వహించిన టెండర్లు వివాదాస్పదమయ్యాయి. అసలు వాటిని ప్రారంభించకుండానే తవ్వుతుండడం తీవ్ర దుమారం రేపుతుంది.

ఇచ్చిన హామీ కోసం

కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుకను ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వదులుకుని ఎన్నికల హామీకి కట్టుబడి సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుకను అమల్లోకి తీసుకువచ్చింది. ఇసుక కొరత లేకండా ఉండేందుకు మరికొన్ని రీచ్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇందులో భాగంగా పర్యావరణ అనుమతి తీసుకుని ఎక్సకవేటర్లతో ఇసుక తవ్వి లారీకి లోడు చేయడం, కూలీలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించే విధంగా రెండు పాలసీలను ఖరారు చేసి టెండరు నిర్వహించింది. ప్రొక్లెయిన్ల ద్వారా లారీలో లోడు చేసేందుకు టన్నుకు రూ.25 ధరతో టెండరు పిలిచింది. చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ సిద్దవటం మండలం గుండ్లమల్ల రీచ్‌లలో ఇసుక లోడింగ్ కోసం టెండర్లు ఆహ్వానించారు. అయితే ఈ రీచ్‌లపై టీడీపీకి చెందిన కొందరు పెద్దలు కన్నేశారు. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలనుకున్నారు. అయితే లోకల్‌గా ఉండే రీచ్‌లు కావడంతో కొందరు టీడీపీ నేతలు కూడా టెండరు కోసం బిడ్‌లు దాఖలు చేశారు. సిద్దవటంలోని రీచ్‌కు 7 మంది, చక్రాయపేట మండలానికి నలుగురు టెండరు వేస్తే సిద్దవటంలో కొందరు 6.30 పైసలు, 11 రూపాయలకు వేయగా, చక్రాయపేటలో కూడా రూ.11, ఇతరత్రా వేశారని చెబుతారు. అయితే ఈ రెండు చోట్ల కొందరి బిడ్‌లను ఉద్దేశ్యపూర్వకంగా డిస్‌క్వాలిఫైడ్ చేసి కేటాయించడంపై టెండరుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నవంబరు చివరి వారంలో టెండర్లు ఓపెన్ చేస్తే ఎల్-1 క్వాలిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అర్హత ఏంటి, డాక్యుమెంట్లు ఏంటి అంటూ సమాచార హక్కుచట్టం ద్వారా అడిగారు. టెండరు ఖరారు కాకుండానే చక్రాయపేట, సిద్దవటం మండలంలో తవ్వకాలు మొదలు పెట్టడంతో దుమారం రేపింది. సిద్దవటంలో స్థానికులు అడ్డుకుని ఓపెన్ చేయకుండా ఎలా అనుమతిస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక చక్రాయపేటలో బుధవారం తవ్వకాలు పరిశీలించగా స్థానికులు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేయడంతో అధికారులు వెళ్లారు. అయితే ఇప్పటికే అక్కడి నుంచి ఎక్సకవేటరు సహా ఉడాయించినట్లు తెలిపారు.

ఈ విషయంపై మైనింగ్ డీడీ సురేశ్‌చంద్రను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఇంకా సిద్దవటం, చక్రాయపేటలో టెండర్లు ప్రాసెస్‌లో ఉన్నాయని, ఇంకా ఓపెన్ చేయలేదన్నారు. కాగా ప్రభుత్వం ఎక్స్‌కవేటరుతో యంత్రాల ద్వారా తవ్వకాలకు టన్నుకు రూ.25 కేటాయించింది. అయితే ఆరు నుంచి రూ.11 లోపే తవ్వుతామని బిడ్‌లు దాఖలు చేయడంతో ఔరా అంటున్నారు. ఎక్సకవేటరు బాడుగ, కూలీలు ఇతరత్రా కలిపితే ఇది సాధ్యం కాదు. మరి ఇంత తక్కువ ఎలా చేశారని కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. అయితే వినియోగదారుల పేరిట ఊడ్చి పొరుగు రాష్ట్రాలకు పంపించేందుకే తక్కువ ధరకు టెండరు వేశారన్న ప్రచారం సాగుతోంది. మొత్తానికి ఈ వ్యవహారం దుమారం రేపుతుంది.

గత ఎన్నికల్లో 151 సీట్లు వచ్చిన వైసీపీని జనం 11 సీట్లకే పరిమితం చేశారు. ఈ స్థాయిలో పార్టీ భూస్థాపితం కావడానికి ప్రధానకారణం భూదందాలు, రౌడీయిజం, ఇసుక మాఫియాతో పాటు ప్రజలు హర్షించని పనులు చేయడమేనని అందరికీ తెలుసు. జిల్లావాసులు వైసీపీని ఏ రేంజ్‌లో తొక్కిపడేశారో కళ్లారా చూశాం. కానీ ఇదే దారిలోనే కొందరు కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శ ఉంది. 2024లో ఓటర్లు.. జగన్ సొంత జిల్లాలోని పార్లమెంటు పరిధిలో ఐదు ఎమ్మెల్యే స్థానాలను కూటమికి కట్టబెట్టారు. సీఎం చంద్రబాబు ఇసుక మాఫియా, మద్యం, భూకబ్జాల జోలికి వెళ్లొద్దని, గత ప్రభుత్వం చేసిన పనులు చేయవద్దని పదేపదే చెబుతున్నా వారికి చెవికెక్కడం లేదు. వైసీపీ పాలసీనే మైండ్‌లో పెట్టుకున్న కొందరు అధికారం అండ చూసుకుని చెలరేగిపోతున్నారు. స్వలాభం కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.

వర్రా కస్టడీ పిటీషన్ విచారణ వాయిదా

కడప రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డి పోలీస్ కస్టడీ పిటీషన్ విచారణను స్థానిక ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదనపు జిల్లా కోర్టు) డిసెంబరు 9కి వాయిదా వేసింది. వర్రాను పోలీస్ కస్టడీకి ఇవ్వాలనే పిటీషన్‌పై గురువారం విచారణ జరగాల్సి ఉంది. కాగా ఈగల్, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను కడపలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో న్యాయవాదులు విధులను బహిష్కరించడంతో న్యాయస్థానం 9వ తేదీకి వాయిదా వేసింది.

రాయచోటిలో ఉద్రిక్తత

● గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ● పెద్దల జోక్యంతో ముగిసిన వివాదం

6



రాణా సర్కిల్‌లో గుమికూడిన ఓ వర్గానికి చెందిన ప్రజలు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..
నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

● గ్రామాలు, మండలాల వారీగా షెడ్యూల్ విడుదల
● 7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల వద్దే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితీసింగ్‌తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలన్నింటికీ పరిష్కార మార్గం చూపేం దుకు ఈనెల 6నుంచి జనవరి 8వ తేది వరకు గ్రామాలు, మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలు, రైతులు వారి సమస్యలను తెలిపి పరిష్కారం పొందాలన్నారు. మండల స్థాయిలో కాకపోతే ఆర్డీవో స్థాయిలో పరిష్కారం చూపుతామని, సమస్య తీవ్రతను బట్టి 45 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి దాకా పరిష్కార వేదిక ద్వారా 6 వేలకు పైగా అర్జీలు అందగా, ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరష్కరించేందుకే ఈ రెవెన్యూ సదస్సులన్నారు. భూ వివాదాల్లో అటవీశాఖ సమ స్యలు ఉంటే అక్కడ వీఆర్వో, డిప్యూటీ తహశీల్దారు, తహశీల్దార్లతో అటవీశాఖ సిబ్బంది కూడా పాల్గొంటారన్నారు. రెవెన్యూ సదస్సుల పర్యవేక్షణకు ప్రతి నాలుగు మండలాలకు ఒక స్పెషల్ ఆఫీసరును నియమించామన్నారు. తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో సదస్సులను విజయవంతం చేయాలన్నారు.

రేపు మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలి

జిల్లా వ్యాప్తంగా 2041 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న మెగా పేరెంట్స్-టీచర్ మీట్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ కోరారు. పేరెంట్స్ మీట్ సమయంలో ప్రతి ఒక్క విద్యార్థికి వ్యక్తిగత సమయం కేటా యించి తల్లిదండ్రులను భాగస్వాములను చేసి సమావేశం నిర్వహిస్తామన్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాలతో పాటు విద్యాప్ర మాణాలు పెంచడమే లక్ష్యంగా పేరెంట్స్- టీచర్ మీట్ ఉంటుందని తెలిపారు. ఎటువంటి రాజకీయాలకు సంబంధం లేకుండా మంచి వాతావరణంలో తల్లిదండ్రులు-విద్యార్థులు-టీచర్స్‌తోనే ఈ కార్యక్రమం నిర్వహించబోతు న్నామన్నారు. ఈ సమావేశాలకు హాజరయ్యే తల్లులకు రంగోళి పోటీలు, తల్లిదండ్రులకు, పిల్లలకు వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలల్లో చదివిన ప్ర ముఖులు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఆ గ్రామాలకు రాకపోకలు బంద్

● గుంజన నదిపై కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

6



కొట్టుకుపోయిన తాత్కాలిన రోడ్డు

మనుగడ కోసమే జగన్ ధర్నా డ్రామా

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మనుగడ కోసమే ధర్నా డ్రామా తెరపైకి తెచ్చారని పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసమర్థ పాలనతో ఒక వైపు రైతులను, మరో వైపు విద్యార్థులను జగన్ నట్టేట ముంచారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను దగ్గరకు కూడా రానివ్వని జగన్, నేడు ప్రజల మీద ప్రేమ ఉన్నట్లు కపట నాటకాలు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించలేదని విద్యార్థుల తరపున ధర్నా చేస్తానని చెబుతున్న జగన్ గత పాలనలో చెల్లించాల్సిన రూ.3500 కోట్లు, వసతి దీవెన కింద రూ.1400 కోట్లు ఎందుకు చెల్లించలేదో చెప్పాలన్నారు. 2019లో చివరి ఇన్‌స్టాల్‌మెంటులో ఒక బకాయి ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు. ఫీజులు కట్టలేదని విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే సహించేది లేదని ఇప్పటికే కళాశాల యాజమాన్యాలను హెచ్చరించామన్నారు. గత పాలనలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఆర్థికంగా అథఃపాతాళానికి నెట్టింది ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. పులివెందుల విషయానికి వస్తే సుందరీకరణ పనులతోనే కోట్ల రూపాయలు ఖర్చు చేశారు తప్ప పులివెందుల అభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. జగన్‌రెడ్డి సీఎం కావడమే పులివెందుల ప్రజలకు శాపమన్నారు. వైఎస్ జగన్ ధర్నా చేయడం కాదని.. జగన్ ఇంటి వద్దనే రైతులు, ప్రజలు, విద్యార్థులు కలిసి ధర్నా చేసే రోజులు ముందున్నాయన్నారు. జగన్ తన సొంత ఊరిలో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా రాష్ట్ర ప్రజల సమస్యలు తీరుస్తానని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీకి వెళ్లని జగన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జగన్ తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

విజ్ఞానం.. మూలకు..!

● వైసీపీ హయాంలో..
● విద్యార్థులకు దూరమైన సైన్స్ మ్యూజియం
● ఆ స్థానంలో సచివాలయ ఏర్పాటు
● నిరుపయోగంగా సైన్స్ పరిశోధనా పరికరాలు
● పట్టించుకోని అధికారులు

6



అసాంఘిక శక్తులకు అడ్డాగా విద్యాలయాలు

● పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆగ్రహం

కడప కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలోని హైస్కూళ్లు, కళాశాలలు మద్యం, గంజాయి, డ్రగ్స్ కేంద్రాలుగా, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయని పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కొన్ని చోట్ల విద్యార్థుల అల్లరిని భరించలేక టీచర్లు, ప్రత్యేకించి మహిళా టీచర్లు క్లాసులకు పోవాలంటే భయపడుతున్నారన్నారు. డిసెంబరు 4న రాయచోటిలో అల్లరి చేస్తున్నందుకు మందలించిన టీచర్ ఎజాజ్‌ను ముగ్గురు విద్యార్థులు దాడి చేయడంతో చనిపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యావ్యవస్థలో నైతిక విలువల కోసం సంస్కరణలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభా పెంచాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతుండడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం ఉన్న జనాభాకు, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్య, సత్తార్, సలావుద్దీన్, మైనుద్దీన్, రఫీక్, సుబ్బారెడ్డి, కదిరి ప్రసాద్ విజయభాస్కర్, ఉత్తన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● కొవ్వొత్తుల ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు


రాయచోటి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్‌పై దాడిని ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం, తల్లిదండ్రుల అతి గారాభంతో పిల్లల అనైతిక మార్గాలను అవలంభిస్తున్న నేటి పరిస్థితుల్లో వారిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించే క్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల అమర్యాదగా వ్యవహరించడం, దాడి చేయడం దారుణమన్నారు. విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారడం, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ప్రశ్నించే వారిపైన దాడికి దిగడం లాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య వృత్తికి సరైన న్యాయం చేయలేకపోతున్నారన్నారు. నాణ్యమైన బోధన చేసే వాతావరణాన్ని కల్పించాలని, ఉపాధ్యాయ భద్రతా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడైనా ఉపాధ్యాయులపై ఆరోపణలు వస్తే సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలే తప్ప ఆరోపణ వచ్చిన వెంటనే తీవ్రమైన చర్యలు తీసుకోవడం తగదని, ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు ఆలోచించాలని వారు కోరారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, తదితర పాల్గొన్నారు.

పెద్దదర్గాలో హీరోయిన్ సందడి



కడప కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రఖ్యాత పెద్దదర్గా (అమీన్‌పీర్)లో లక్కీభాస్కర్ హీరోయిన్ మీనాక్షిచౌదరి సందడి చేశారు. ఆమె గురువారం పెద్దదర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమెను దర్గా ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తను నటించిన లక్కీభాస్కర్ సినిమా విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే దర్గాను దర్శించినట్లు తెలిపారు. మరిన్ని కొత్త సినిమా అవకాశాలు వస్తున్నాయని, జనవరిలో మరో పెద్ద ప్రాజెక్టు చేయనున్నట్లు వెల్లడించారు. ఆ సినిమా వివరాలు త్వరలో తెలుపుతానన్నారు.

రేపు ఉపముఖ్యమంత్రి రాక



కడప కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ 7వ తేది శనివారం కడప పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన 7న ఉదయం 9-30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు 10-15 గంటలకు చేరుకుంటారు. 10-20లకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి కడప మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ కార్యక్రమానికి 10-45 గంటలకు చేరుకుంటారు. అనంతరం ఒంటి గంటకు అక్కడి నుంచి కడప ఎయిర్‌పోర్టుకు బయిలుదేరి 1-25 గంటలకు చేరుకుని, 1-30 గంటలకు హైదరాబాద్ బేగంపేటకు విమానంలో బయిలుదేరి వెళతారని తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌ను జేసీతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లను కలెక్టరు పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఎర్విన్, కమిషనరు మనోజ్‌రెడ్డి, డీఈవో మీనాక్షి, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్

నిరుపేద గూటికి
అందని సాయం..

- ప్రభుత్వ పింఛన్ లేదు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



వాల్మీకిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూలి జీవనం సాగితే కానీ పూట గడవని నిరుపేద కుటుంబం ఆపై ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతూ ప్రభుత్వ సాయం కోసం ఆ నిరుపేద కుటుంబం ఎదురుచూస్తోంది. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన చలమకోటి వెంకటరమణ(58), ఈశ్వరమ్మలది నిరుపేద కుటుంబం ఆ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిత్యం కూలి పనులకు వెళ్లి పొట్టపోసుకునే ఆ నిరుపేద బతుకుల్లో భరించలేని కష్టం వచ్చిపడింది. ఒకటన్నర సంవత్సరం క్రితం కూలి వెంకటరమణ నిమ్మనపల్లె వద్ద దినసరి కూలి పనులకు వెళ్లి చెట్టునుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకున్నా ఫలితం లేక రెండు కాళ్లు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. వెంకటరమణ కదలలేని స్థితిలో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలు వర్ణనాతీతంగా మారాయి. ప్రతినెలా వెంకటరమణ మందుల నిమిత్తం రూ.10వేలకు పైగానే కావాల్సి ఉంది. డబ్బులున్న సమయంలో తప్ప కనీసం మందులు తెచ్చుకునే ఆర్థిక స్తోమత లేక చిన్నాభిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత వెంకటరమణకు పింఛన్ కోసం గతేడాది డిసెంబరులో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి దాకా ప్రభుత్వ పింఛన్ కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వెంకటరమణ భార్య ఈశ్వరమ్మకు కూడా కిడ్నీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కనీసం కూలి పనులకు వెళ్లలేని ఆ దంపతులకు జీవనం కష్టసాధ్యంగా మారింది. కుమార్తెకు పెళ్లి చేసి పంపించగా ఉన్న ఒక్క కుమారుడు రెడ్డిప్రసాద్ మాత్రమే తల్లిదండ్రులకు ఆసరాగా దినసరి కూలి పనులకు వెళ్లి కుటుంబ జీవనానికి దోహదపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి సాయం అందించలేదని కనీసం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆ నిరుపేద దంపతులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. వైద్యం నిమిత్తం ఆర్థిక స్తోమత లేని తమకు దాతలు ఎవరైనా సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. దాతలెవరైనా సాయం చేయదలిస్తే సెల్‌ఫోన్ నెంబర్లు 7095715229, 7416744175లకు ఫోన్ పే ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం.. విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పించాం అని గత వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ ప్రతి ప్రసంగంలో ఊదరగొట్టేవారు. అయితే జగన్ సొంత జిల్లా కేంద్రంలో 15 సంవత్సరాలకు పైగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఏకైక సైన్స్ మ్యూజియంను ఆయన సీఎంగా ఉన్న సమయంలోనే నిర్వీర్యం చేశారు. దీని స్థానంలో ఏకంగా సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులోని సైన్స్ పరికరాలను మూలకు చేర్చి విద్యార్థులకు విజ్ఞానం అందకుండా చేశారు.



మూలకు చేరిన సైన్స్ పరికరాలు



బెర్రానోని

విజ్ఞానం.. మూలకు..!

- వైసీపీ హయాంలో..
- విద్యార్థులకు దూరమైన సైన్స్ మ్యూజియం
- ఆ స్థానంలో సచివాలయాల ఏర్పాటు
- నిరుపయోగంగా సైన్స్ పరిశోధనా పరికరాలు
- పట్టించుకోని అధికారులు



సైన్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని చెన్నూరు బస్టాండు సమీపంలో విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం కల్పించేందుకు 2006లో అప్పటి కలెక్టరు అశోక్‌కుమార్ చైర్మన్‌గా జిల్లా సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేశారు. వైస్ చైర్మన్‌గా అప్పటి డీఈవో బాలయ్య నియమితులయ్యారు. ఆ రోజుల్లోనే దాదాపు రూ.20 లక్షల వ్యయంతో సైన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మ్యూజియం విద్యార్థులకు అందుబాటులో ఉండేది. జిల్లా నలుమూలల నుంచి వచ్చి విద్యార్థులు సైన్స్ మ్యూజియంను సందర్శించేవారు. సైన్స్ ఉపాధ్యాయులు కూడా ఎంతో ఉత్సాహంతో విద్యార్థులకు సైన్స్ పరికరాలు చూపిస్తూ వాటిని ప్రయోగాత్మకంగా బోధించేవారు.



సోలార్‌మీటర్

మ్యూజియంలోని పరికరాలు

- రోలర్ బాల్: భూమి ఆకర్షణ ద్వారా వివిధ రకాల శక్తిమార్పిడి గురించి వివరించేందుకు సైన్స్ మ్యూజియంలో ప్రయోగాత్మకమైన పరికరం రోలర్‌బాల్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు అది దేనికీ పనికి రాకుండా ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ చిలుము పట్టి మూలకు చేరింది.
- సౌండ్ సోనామీటర్: ధ్వని వేగాన్ని నేరుగా విద్యార్థులకు తెలియజేసేందుకు సౌండ్ సోనామీటరు ఉపయోగపడుతుండేది. శూన్యంలో ధ్వని ప్రయాణం చేయదు అన్న భావనను ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చు.
- విద్యుత్‌శక్తి : యాంత్రికశక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ప్రయోగాత్మక పరికరం.

విలువైన పరికరాలు నిర్వీర్యం

విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు సైన్స్ మ్యూజియంలో ఎంతో విలువైన సైన్స్ పరికరాలు, పుస్తకాలు ఉండేవి. శాస్త్రీయ పరిశోధనల వైపు విద్యార్థులను నడిపించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతుండేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా సచివాలయ వ్యవస్థను తీసుకురావడం ఈ సైన్స్ మ్యూజియంకు శాపంగా మారిందని చెప్పాలి. మ్యూజియంలో ఉన్న విలువైన పరికరాలను ఒక మూల కుప్పలుగా వేసి నిర్వీర్యం చేశారు.



కుప్పలు తెప్పలుగా పుస్తకాలు, బ్రోచర్లు

వీటితో పాటు మరెన్నో సైన్స్ పరికరాలు మూలకు చేరి, ఎందుకూ పనికి రాకుండా పోయాయి.

సచివాలయాల ఏర్పాటు

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ జిల్లా సైన్స్ విద్యార్థులకు శాపంగా మారిందని చెప్పాలి. కడప నగరంలో ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో ఖాళీ భవనాలు ఉన్నప్పటికీ వాటిలో సచివాలయాలు ఏర్పాటు చేసుకోకుండా.. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న సైన్స్ మ్యూజియంను తొలగించి ఆ స్థానంలో రెండు సచివాలయాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విజ్ఞానం అందే విషయంలో వైసీపీ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఈ ఒక్క ఉదాహరణ చాలు.



యంత్ర శక్తిని విద్యుత్‌శక్తిగా మార్చే యంత్రం

ఎన్నికల ముందు హడావిడి

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా సైన్స్ మ్యూజియం అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ నిధులు అలాగే నిలిచిపోయాయి. తీరా సైన్స్ మ్యూజియంను అభివృద్ధి చేద్దామంటే అక్కడ సచివాలయాలు ఉన్నాయి. వైసీపీ హయాంలో మంజూరు చేసిన రూ.12 లక్షల నిధులు మ్యూజియం ఏర్పాటుకు ఏ మాత్రం కూడా సరిపోవని అంటున్నారు. కేవలం మ్యూజియం భవనం మరమ్మతులు చేయడానికే ఆ నిధులు సరిపోయే అవకాశం ఉంది. మూలనపడ్డ విలువైన సైన్స్ పరికరాలు మరలా కొత్తగా ఏర్పాటు చేయాలంటే మరిన్ని నిధులు అవసరం. ఇప్పటికైనా సైన్స్ మ్యూజియంపై కలెక్టర్ దృష్టి సారిస్తే జిల్లా విద్యార్థులకు కొంత మేలు కలిగే అవకాశం ఉంది.

త్వరలో పునఃప్రారంభిస్తాం
- డీఈవో మీనాక్షి



జిల్లా సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మున్సిపల్ కమిషనరును కలిసి చర్చించాం. సచివాలయాలను వేరే చోటకు షిఫ్ట్ చేసి మ్యూజియంను అప్పగించాలని కమిషనర్ తెలిపారు. ఒక సైన్స్ టీచరును కేర్ టేకర్‌గా నియమించాం. అలాగే సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం ఎస్టిమేషన్ రూపొందిస్తున్నారు. సైన్స్ మ్యూజియంను మాకు అప్పగించిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

ఆ గ్రామాలకు రాకపోకలు బంద్

- గుంజన నదిపై కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు





రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య తెగిపోయిన తాత్కాలిక రోడ్డు, నిర్మాణంలో ఉన్న వంతెన

రైల్వేకోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో గుంజన నది ఉధృతంగా ప్రవహించడంతో రెడ్డివారిపల్లెకు వెళ్లే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో 8 రోజులుగా విద్యార్థులతో పాటు ప్రజలు రైల్వేకోడూరుకు వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేకోడూరు నుంచి రెడ్డివారిపల్లె కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఉంది. ఈ నదిపై గతంలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో వైసీపీ ప్రభుత్వంలో కొత్త బ్రిడ్జి మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభించారు. పనులు పూర్తయ్యేంత వరకు నదిపై తాత్కాలిక మట్టి రోడ్డు వేశారు. వర్షాలు వచ్చినప్పుడల్లా తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. ఇప్పటికి 5 సార్లు కొట్టుకుపోయిందని రెడ్డివారిపల్లె గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుతం 8 రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కూలీలు తదితరులు రెడ్డివారిపల్లె నుంచి కేఎస్ అగ్రహారం మీదుగా బయనపల్లె కట్ట నుంచి రైల్వేకోడూరుకు రావాల్సి వస్తోంది. అదేవిధంగా పాటిపాళెం మీదుగా చెరువు కట్టపై రైల్వేకోడూరుకు వస్తున్నారు. సుమారు రానుపోను 8 కిలోమీటర్ల దూరం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితేనే రెడ్డివారిపల్లె, పాటిమీదపాళెం, గుర్రపాళెం, పిల్లగుట్టకాలనీ, అగ్రహారం, దళితవాడలు, గంగిరెడ్డులమిట్ట తదితర గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు వద్ద వరద నీటి ఒరవడి ఉంది. అధికారులు అటువైపు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. వరద నీరు తగ్గిన తర్వాత తాత్కాలిక రోడ్డు వేస్తామని రోడ్లు భవనాల శాఖ అధికారులు అంటున్నారు.

పోలీసుల ముమ్మర విచారణ

- పోలీసుల అదుపులో ముగ్గురు

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పీలేరులో బయటపడిన రెవెన్యూ శాఖ నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంపై పోలీసులు ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. తహసీల్దారు భీమేశ్వరరావు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్, స్థానిక స్టాంపురైటర్ ఇళ్లలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఈ విషయాన్ని స్థానిక పోలీసులు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన బుధవారం సాయంత్రం పీలేరుకు చేరుకుని ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. రాయచోటిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి అనుమానాస్పద మృతి ఉదంతం వెలుగులోకి రావడంతో ఆయన హుటాహుటిన అక్కడకు వెళ్లిపోయారు. గురువారం పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ తహసీల్దారు భీమేశ్వరరావుతో చర్చలు జరిపారు. కంప్యూటర్ ఆపరేటర్, స్టాంపు రైటర్‌తోపాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

లాటరీ విక్రేతల బైండోవర్

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు తహసీల్దారు ముందు బైండోవర్ చేశారు. ఎస్‌ఐ బాలకృష్ణ మాట్లాడుతూ తమకు అందిన రహస్య సమాచారం మేరకు పట్టణంలోని పలుచోట్ల దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.53,750లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం తహసీల్దారు ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

- అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగిన పురవీధులు



అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

రాయచోటిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శివాలయం చెక్‌పోస్టు దగ్గర వెలిసిన ఉమామహేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా హరహరసుతునికి అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. ప్రతియేటా అయ్యప్పస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా శివపార్వతులతో పాటు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు నటరాజ స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు శివగంగిరెడ్డితో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వ్యవస్థాపకులు హరినాధ్‌రెడ్డిలు ప్రారంభించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అయ్యప్ప స్వాములతో పాటు మహిళా భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ గ్రామోత్సవం కార్యక్రమం శివాలయం నుండి ఎస్‌ఎన్‌కాలనీ, నేతాజీ కూడలి, బస్టాండు మీదుగా కొత్తపేట, మదనపల్లె రోడ్డు వరకు కొనసాగింది. ఈ గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రాఫిక్ సీఐ విశ్వనాధ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నారా లోకేశ్ పట్టుదలతో విద్యారంగంలో మార్పులు

- రీజనల్ టెక్‌ఫెస్ట్‌లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలానికి తగిన విధంగా మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో సమూల మార్పులకు పట్టుదలతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజినల్ టెక్ ఫెస్ట్-24ను గురువారం ఆయన ప్రారంభించారు. సంప్రదాయ చదువులకు కాలం చెల్లిందని, సృజనాత్మక చదువుల వల్లే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తాము హైదరాబాదులో చదువుకున్న కారణంగానే ఆ స్థాయి విద్యా సంస్థలను కలికిరిలో ఏర్పాటు చేసేందుకు ప్రేరణ పొందినట్లు చెప్పారు. ఫలితంగానే కలికిరి ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. పదేళ్ల క్రితం ఉమ్మడి ఏపీలో ఒకే ఒక్క సైనిక్ స్కూల్ కోరుకొండలో మాత్రమే ఉండేదని, అప్పట్లోనే రెండో సైనిక్ స్కూల్‌ను కలికిరిలో ఏర్పాటు చేయడంలో విజయవంతమయ్యామన్నారు. విభజిత ఏపీలో మాత్రమే ప్రస్తుతం రెండు సైనిక్ స్కూళ్లు ఉన్నాయని చెప్పారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మరో రెండు కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తెస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంత చిన్న మండలంలో ఇన్ని రకాల విద్యా సంస్థలు ఏర్పాటు కావడానికి నల్లారి కుటుంబం అంకితభావమే కారణమని ప్రశంసించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్‌ఫెస్ట్‌లు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం టెక్‌ఫెస్ట్‌లో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు రూపొందించిన అనేక రకాల నూతన ఆవిష్కరణల ప్రదర్శనను కిశోర్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఒక్కోదాని ప్రాధాన్యతను, పనితనాన్ని, వాటి అవసరాన్ని గురించి వాటిని రూపొందించిన విద్యార్థులు వివరించారు. మొత్తం 75 మంది విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలల నుంచి ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ టెక్‌ఫెస్ట్‌లో పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణల ప్రదర్శనలను తిలకించడానికి స్థానిక ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

రాయచోటిలో ఉద్రిక్తత

- గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- పెద్దల జోక్యంతో ముగిసిన వివాదం

రాయచోటి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఠాణా సర్కిల్‌లో గురువారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి జాతీయ రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. సకాలంలో ఓ వర్గానికి చెందిన పెద్దలు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి ఎస్‌ఎన్ కాలనీ శివాలయం నంది సర్కిల్ నుంచి అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం మొదలైంది. ఎస్‌ఎన్ కాలనీ, నేతాజి సర్కిల్, ఠాణా, కంసల వీధి, గాంధీబజార్, కొత్తపేట, జగదాంబసెంటర్, మదనపల్లె రోడ్డు మీదుగా అయ్యప్పస్వాముల గ్రామోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వాముల గ్రామోత్సవం ఠాణా సర్కిల్ దాటుకోగానే ఏం జరిగిందో ఏమో మరో వర్గం ఆందోళనకు దిగింది. పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు గంటపాటు ఆగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆందోళన వర్గానికి చెందిన మతపెద్దలు, పట్టణంలోని కొందరు ప్రముఖులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు. అదేసమయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సైతం ఆందోళన చేస్తున్న వర్గానికి చెందిన ముఖ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సర్దుబాటు చేయాలని కోరారు. దీంతో ఎట్టకేలకు ఎటువంటి హింసాత్మక సంఘటన జరగకుండా ఆందోళన విరమించారు. సంఘటనా స్థలానికి రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన ఎస్‌ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది చేరుకుని బందోబస్తు నిర్వహించారు.



ఠాణా సర్కిల్‌లో గుమికూడిన ఓ వర్గానికి చెందిన ప్రజలు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

● డీపీఆర్సీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని డీపీఆర్సీ ప్రిన్సిపాల్(జడ్పీసీఈఓ) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్(డీపీఓ) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రక్రియపై విస్తరణాధికారులు(ఈఓపీఆర్డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు జిల్లా స్థాయి శిక్షణను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్, ఆర్జీఎస్ఏ నిధులతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ(ఏపీఎస్ఆర్ఐడీ అండ్ పీఆర్) ఆధ్వర్యంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై డిసెంబరు 5, 6 తేదీల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. రెండు బ్యాచ్‌ల ద్వారా ప్రతి మండలం నుంచి ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మండలానికి ఒకరు చొప్పున మొత్తం ఆరుగురు హాజరవాలన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తైన తరువాత డిసెంబరు 10 నుంచి 19 వరకు మండలాల్లో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు, మండల లైవ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు, సెక్రటేరియట్ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా తయారు, అమలు చేయాలన్నారు. లేకుంటే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుక బడే ప్రమాదం ఉందన్నారు. అందు కోసం ఈ శిక్షణను జిల్లా, మండల స్థాయిలో పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ అధికారులు అబ్జర్వర్‌గా శిక్షణకు హాజరై పూర్తిగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ విషయాలను శిక్షకులు దృష్టిలో పెట్టుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను విధినిర్వహణలో అమలు పరిచి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. ఈ శిక్షణలో డీపీఆర్సీ ఏఓ బండపల్లె నాగభూషణం ఆయా మండలాల విస్తరణాధికారులు(ఈఓపీఆర్డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్పీకి ఉధృతంగా వర్షం నీరు



లోయరు సగిలేరు నుంచి ప్రవహిస్తున్న నీరు

బి.కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లోయర్ సగిలేరు ప్రాజెక్టుకు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ తట్టు నుంచి డ్యాంకు వెయ్యి క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతుంది. దీంతో సగిలేటికి 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇంకా డ్యాంకు వర్షం నీరు అధికంగా చేరుతోందని అప్రమత్తంగా ఉంటూ ఎప్పటి కప్పుడు డ్యాంకు చేరే నీళ్లను పరిశీలిస్తూ సగిలేటికి ఇంకా విడుదల పెంచుతామని ఆయన తెలిపారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎంపిక



ఎన్‌టీఏ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నోబుల్‌టీచర్స్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా రామక్రిష్ణంరాజు, రామసుబ్బన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కె.రవీంద్ర, ఆర్థిక కార్యదర్శిగా ఎ.చలపతిరాజు, రాష్ట్ర కౌన్సిలరుగా కె.అబ్దుల్‌గఫార్ ఎన్నికైనట్లు ఎన్‌టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం ఎన్‌టీఏ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్‌టీఏ నేతలు లక్ష్మినారాయణ, మురళీమోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబజారు వీధి వాసి పఠాన్ దౌలత్‌బీపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గత రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బుర్ఖా వేసుకుని వచ్చి బాధితురాలి కంట్లో కారం చల్లి కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులకు సమాచారం అందించి ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బినాతి మోహన్ (48) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు కసిరెడ్డిగారి పల్లి పంచాయతీ కొత్తపల్లి వాసి మోహన్ గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని తన పొలానికి నీరందించేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసే యత్నంలో, కిందపడి ఉన్న విద్యుత్ వైరును తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ, సిబ్బంది మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమీషన్లు పెంచకపోతే ఆందోళన తప్పదు

● తక్షణమే గెజిట్ ప్రకారం ఇవ్వాలి

● ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్



ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ నేతలు

కడప(క్రైం)డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలపై ప్రభుత్వం చెల్లించే కమీషన్లు 9శాతం నుంచి గెజిట్‌లో పేర్కొన్నట్లు 20 శాతానికి పెంచకపోతే ఆందోళనకు దిగుతామని ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 14వతేదీ నుంచి మద్యం కొనుగోలు నిలుపుదల చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వైన్స్‌అండ్‌బార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వారు ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఇస్తున్న కమీషన్లు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి 20శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో బార్, వైన్ షాపుల యాజమాన్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు తీవ్రగాయాలు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. అన్నమయ్య జిల్లా గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మంగారిమఠం మండలం కంది మల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలంలో ప్రజల సాయంతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఘాట్ రోడ్డు వెంబడి 108 వాహనాన్ని నడుపుతూ వస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ అయి ప్రమాదవశాత్తు డివైడరుకు ఢీకొన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆధునికం.. వేగవంతం...

● సాంకేతికతకు పెద్దపీట
● తగ్గుతున్న ఖర్చు
● యాంత్రీకరణతో ముందడుగు



నాడు ఎద్దులతో సేద్యం



తూర్పారబడుతున్న రైతులు



పవర్ స్ప్రేయరుతో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవన ప్రవాహంలో వేగం పెరిగింది. ఇందుకు అనుగుణంగా సాంకేతికతలో ఆధునికత సంతరించుకుంది. మారుతున్న కాలానికనుగుణంగా రైతు వినూత్న పద్ధతుల ద్వారా సాగుకు నడుం బిగిస్తున్నారు. అంతేకాకుండా రైతులు సైతం సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. వ్య వసాయంలోనూ యాంత్రీకరణను వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ పద్ధతుల్లో వేగం పెరుగుతోంది. ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నందున రైతన్నకు వ్యవసాయం మరింత సులభతరమైంది. వివరాల్లో కెళితే...

రాజుపాలెం మండలంలో 13 పంచాయతీలకు దాదాపు 28వేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. ఎద్దుల ద్వారా పంట పొలాలు దున్ని విత్తనం వేస్తున్న రోజుల్లో ఎకరాకు వరి పది నుంచి 12 బస్తాల శనగలు 3 నుంచి 4 క్వింటాళ్లు, జొన్నలు 10 క్వింటాళ్ల పంటను పండించే వారు. పంటల నూర్పిళ్ల కోసం నానా అవస్థలు పడేవారు. ప్రతి రైతు సొంత పొలాల్లో కల్లం ఏర్పాటు చేసుకుని ఎద్దుల బండ్ల ద్వారా కల్లాలకు తరలించి వాటిని నూర్పిళ్లు చేసి పంటను ఇంటి ముందు కర్లనాల్లో నిల్వ చేసుకునేవారు. మందు పిచికారీ సైతం బుడ్డ పంపులతో రోజుకు ఎకరా పొలానికి మందు పిచికారీ చేసుకునే రైతన్నకు 2012 నుంచి నేటి వరకు యాంత్రీకరణ ఆధునిక పద్ధ తులు రావడంతో ఎద్దుల స్థానం నుంచి ట్రాక్టరు మొదలైంది. రోజుకు 2 ఎకరాలు సాగు చేసుకునే రైతుకు ట్రాక్టరు ద్వారా 10 ఎకరాల నుంచి 20 ఎకరాలు సేద్యం చేసుకునే స్థాయికి అడుగు పడింది. విత్తనం గొర్రు, పిల్లర్లు, గేజ్‌వీలర్‌తో దమ్ము చేయడం, చెత్తకట్టలు యంత్రం ద్వారా చుట్టలు చుట్టడం, పవర్ స్ప్రేయర్లతో మందు పిచికారీ చేయడం వల్ల ఎకరా నుంచి ఐదెకరాలు సాగు చేసుకునేందుకు సిద్ధమైన రైతుకు వ్యవసాయం మరింత సులభతరమైంది. ట్రాక్టరు పంపు ద్వారా మందు స్ప్రే చేస్తే రోజుకు పదెకరాల పంటకు మందు స్ప్రేచేయవచ్చు. దీంతో ఖర్చులు కూడా బాగా తగ్గాయి. తరువాత స్థానంలో డ్రోన్ ద్వారా మరింత మందు పిచికారీ చేయడం సులభతరమైంది. పంట నూర్పిళ్ల యంత్రాలు రావడంతో రోజుకు ఎకరా వరి పంట కోసి వాటిని నూర్పిళ్లు చేసుకునే రైతన్న రోజుకు పదెకరాల పంటను నూర్పిళ్లు చేస్తున్నారు. తూర్పారబట్టే బాధలేకుండా పంటను డైరెక్టుగా ఇంటికి తెచ్చుకునే సౌకర్యం ఏర్పడింది. ఇలా వ్యవసాయ యాంత్రీకరణతో రైతుకు దిగుబడి పెరిగింది. ఎకరాకు 25 బస్తాల వరి ధాన్యం నుంచి 35 బస్తాలు, 10 క్వింటాళ్ల జొన్న నుంచి 25 క్వింటాళ్లు, 3 క్వింటాళ్ల శనగ నుంచి 12 క్వింటాళ్లకు పెరగడంతో రైతులు ఆధునిక యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. ఖర్చు తగ్గడంతో రైతులు కొంత మేర కోలుకుంటున్నారు. ధాన్యాన్ని ప్రైవేటు గోదాము, ప్రభుత్వ గోదాముల్లో కూడా నిల్వ ఉంచడం, వాటిపై రుణం కూడా ఇవ్వడంతో మరింత ముందుకు సాగారు. ఏదేమైనా యాంత్రీకరణ ద్వారా రైతుకు వ్యవసాయం సులభతరమైంది.



నేడు ఆధునిక పద్ధతిలో ట్రాక్టరుతో సేద్యం చేస్తున్న దృశ్యం



ఆధునిక యంత్రం ద్వారా కోత



డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

వ్యవసాయం సులభం



50 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నాం. కాడెద్దులతో పంట దున్నడం, పంట వేసుకోవడంతో చాలా ఇబ్బందులు పడే వారం. దానికి తోడు కూలీల కొరత ఉండేది. యాంత్రీకరణతో వ్యవసాయం సులభతరమైంది. ఆధునిక యుగంలో ప్రతి పనికీ ఇంజనీరింగ్ వ్యవస్థ అభివృద్ధి చెంది కొత్త కొత్త పరికరాలు రావడంతో వ్యవసాయం సులభతరమైంది.

సుధాకర్‌రెడ్డి, తొండలదిన్నె

కూలీల కొరత తగ్గింది



వ్యవసాయ పనులు చేయాలంటే కూలీలు దొరక్క ఒకరి తర్వాత ఒకరు చేసుకునే వారు. పంట నూర్పిళ్లలో ఎంతో శ్రమపడేవారం. శనగ పంట పంటల్లో మందు పిచికారీ చేయడం, బుడ్డపంపు పవర్ స్ప్రేయర్ల ద్వారా కూలీలు ఇబ్బంది పడేవారు. ఎకరాకు 500 ఖర్చు వచ్చే తరుణంలో యాంత్రీకణ ఖర్చు తగ్గి స్తోంది.

సోము నారాయణరెడ్డి, రైతు

పైసలు లేనిదే పని జరగదు

● అర్జీలు ఇవ్వడం ప్రహసనమే... ● పడిగాపులు కాస్తున్న అర్జీదారులు



ఆర్డీఓ చాంబర్ వద్ద పడిగాపులు కాస్తున్న అర్జీదారులు

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో రెవెన్యూ సదస్సులకు పరిష్కారం మార్గం కావాలంటే రెవెన్యూ డివిజనల్ అధికారిని సంప్రదించాలి. అయితే ఇక్కడ ఆర్డీఓను కలవాలంటే ఆర్డీఓ చాంబర్‌లో ప్రధాన గేటు వద్ద పైసలు ఇవ్వనిది అర్జీదారులు లోనికి వెళ్లలేరనే ఆరోపణలున్నాయి. అంటే దేవుడు కరుణించాలంటే పూజారి చేయి తడవాల్సిందేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కార్యాలయంలోకి అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. గురువారం ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో ఆర్డీఓ సాయిశ్రీకి అర్జీదారులు వినతి పత్రాలు అందించే సమయంలో ఫొటోలు తీయకూడదని స్వయంగా ఆర్డీఓ తెలపడమే ఇందుకు నిదర్శనగా చెప్పవచ్చు. వివరాల్లోకెళితే...

జమ్మలమడుగు డివిజన్ రెవెన్యూ కార్యాలయం పరిధిలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల తదితర ప్రధాన ప్రాంతాలున్నాయి. రెవెన్యూ పరిధిలో ప్రజలకు ఉత్పన్నమయ్యే వివిధ సమస్యలకు బాధితులు అర్జీలతో వస్తారు. ఆర్డీఓ చాంబర్ ప్రధాన గేటు వద్దే సంబంధిత సిబ్బందితో మాట్లాడి లోనికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓనే స్వయంగా సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అర్జీదారులు అందజేసిన అర్జీలు బుట్టదాఖలు అవుతున్నాయని బహిరంగ ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకులు చెప్పిన వాటికే, అది కూడా పైసలు లేనిది పని జరగడంలేదని అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా జమ్మలమడుగు మండలం గొరిగెనూరు నుంచి కె.నాగలక్ష్మి, భర్త చెన్నప్పతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వద్దకు అర్జీ తీసుకుని వచ్చారు. వారిని లోనికి పంపలేదని చేస్తున్నారని వాపోయారు. గతంలో కూడా అర్జీలు ఇచ్చామని, 1.23 ఎకరాల పొలం సమస్య ఉందని, అధికారులకు చెప్పినా ఏ ఒక్కరూ ఇంతవరకూ రాలేదని, పని జరగకపోవడంతో మళ్లీ అర్జీ తీసుకువచ్చామని బాధిత హరిజన మహిళ మొరపెట్టుకుంది. ఆర్డీఓ కార్యాలయంలో కాకుండా రెవెన్యూ కార్యాలయంలో సైతం కిందిస్థాయి నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారని, పైసలు లేనిది ఎక్కడా పని జరగడంలేదని బాధిత మహిళ వాపోయింది. ఎర్రగుంట్ల వాసి గౌతమి రేషన్ డీలర్ షాపు నిర్వహిస్తోంది. అయితే రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆర్డీఓ సాయిశ్రీకి సమస్యల గోడు చెప్పేందుకు వచ్చామని, ఇక్కడా రాజకీయం, కాసులు రాజ్యమేలుతోందని ఎంత సేపటికీ ఆర్డీఓ వద్దకు పంపరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పి.శ్రీనివాసులరెడ్డి అర్జీలు అనేకసార్లు ఇచ్చినట్లు, ఆరు నెలల నుంచీ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం కాళ్లకు చెప్పులరిగేలా తిరుగుతున్నా, ముగ్గురు ఆర్డీఓలు మారినా ఫైలు మాత్రం కదలడంలేదని వాపోయాడు. డబ్బు ఇవ్వాలని అక్కడున్న సిబ్బంది అడుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. డివిజన్ పరిధిలో దాదాపు 300 రేషన్ డీలర్ల యజమానుల నుంచి అందినకాడికి ఒక్కొక్కరితో నాలుగు నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు, కొండాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి సుమారు 30దాకా అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెవెన్యూ కార్యాలయాల్లో జిల్లా అధికారులు విచారణలు చేయాలని, ఆర్డీఓ కార్యాలయంలో కొన్నేళ్లగా కొందరు బదిలీ కాకుండా ఇక్కడే నన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పలు సమస్యలపై అర్జీదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షం ధాటికి నేలకూలిన ఇల్లు

ఒంటిమిట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దర్జిపల్లెలో వర్షం ధాటికి రెండు పాడుబడిన ఇళ్ల పైకప్పు కూలి నేలకూలాయి. వర్షం ధాటికి ఇళ్ల నేల కూలుతాయని ముందస్తు సమాచారంతో పక్కన ఇంటికి పోయారని, ఇంట్లో సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం అయ్యాయని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విప్లవాత్మక ఆవిష్కరణకు భారత్, యూకే పేటెంట్

పేటెంట్ గ్రహీత ప్రొఫెసరు రఘుబాబుకు వైస్‌చాన్సలర్ ప్రశంసలు



పేటెంట్ గ్రహీత రఘుబాబును అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో శాస్త్రసాంకేతిక రంగంలో అద్భుతాలు కొనసాగుతున్న వేళ వైవీయూ జియాలజీ విభాగం, టీఎస్ఐఆర్ నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త పరిశోధనల ద్వారా రెండు ప్రతిష్ఠాత్మక పేటెంట్లను సాధించడం గర్వకారణంగా నిలిచింది. 'జియో ఇంటిగ్రేటెడ్ సాయిల్ ప్రాపర్టీ డివైజ్ విత్ ఎంటాన్ జీపీఎస్ అక్యురసీ' ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, 'జియో పేషియల్ మల్టీ సెన్సార్ సాయిల్ టెస్టింగ్ ప్రొబ్' ఆవిష్కరణకు యూకే డిజైన్ పేటెంట్ లభించింది. ఈ రెండు ఆవిష్కరణలు భూసార పరిశోధన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. ఈ పరికరాలు భూమి క్షారగుణాలను ఖచ్చితంగా గుర్తించి భౌగోళిక సమాచారాన్ని సమర్థవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జీపీఎస్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి భూసారం విశ్లేషణను అధునాతనంగా మార్చే ఈ పరికరాలు భూసార పునరుద్ధరణ, వ్యవసాయం, భూమి వినియోగ సామర్థ్యాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయి. ఈ విజయాల్లో పరిశోధకులు అనూష బోయ నక్కల, డాక్టర్ ప్రదీప్‌కుమార్ బాలుపల్లి, డాక్టర్ చట్రం గుగ్గులోతు, వైవీయూ ప్రొఫెసరు రఘుబాబు కొట్టాల, పద్మశ్రీ, దీపిక కృషి ముఖ్యమైనది. వారు ఆవిష్కరించిన ఈరెండు పరికరాలు వ్యవసాయేతర రంగాలకు కూడా విస్తృత ప్రయోజనాలు అందిస్తున్నాయి. వైస్‌ఛాన్సలరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు పద్మ, భూగర్భశాస్త్రవిభాగం ప్రొఫెసరు సునీత, ప్రొఫెసరు జయరాజ్, శ్రీనివాస్‌గౌడ్, టీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ సవిత, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదం విషయంలో విచారణకు వెళ్లిన లింగంపల్లి వీఆర్ఏ కిశోర్‌పై కాజిపల్లెకు చెందిన నిమ్మకాయల ఓబులరెడ్డి, జయరాం రెడ్డి దాడి చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ కేసు విషయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామంలో విచారణ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

వైవీయూ విద్యార్థికి మరో కాంస్యం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ దక్షిణ అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వైవీయూకు మరో కాంస్య పతకం లభించింది. దీంతో వైవీయూ మొత్తంమూడు పతకాలు సొంతం చేసుకుంది. కమలాపురం సీ ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం కళాశాల విద్యార్థి రాజశేఖర్ 109 కిలోల విభాగంలో నాక్‌లో 124 కిలోలు, క్లీన్‌జర్క్ విభాగంలో 171 కిలోలు మొత్తం 295 కిలోలు బరువు ఎత్తి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. రాజశేఖర్‌ను వైస్‌చాన్సలర్ స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వ్యాయామవిద్య సెక్రటరీ కె.రామసుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : ఎమ్మెల్యే



లఘు చిత్రానికి క్లాప్ ఇస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం 'బాల్య వివాహాలు రద్దు' లఘు చిత్రానికి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికడదాం అని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ భైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్య యాదవ్, సగమేశ్వర విద్యాసంస్థల కార్యదర్శి వివి సుబ్బానాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేవరకు పోరాటం

● ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా కన్వీనరు చంద్రశేఖర్



నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక నాయకులు

కడప సెవెన్‌రోడ్స్/నాగరాజుపేట,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేవరకు పోరాటం చేస్తామని ఉక్కుసాధన ఐక్యవేదిక జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు రామమోహన్, సుబ్బమ్మ, మనోహర్, దస్తగిరి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, అన్వేష్, రామక్రిష్ణారెడ్డి, కుమారస్వామిరెడ్డి, గోపాలక్రిష్ణయ్య, వెంకటసుబ్బయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను విస్మరిస్తున్న బీజేపీ

కడప నాగరాజుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :కడప ఉక్కు పరిశ్రమను బీజేపీ విస్మరిస్తోందని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు అన్నారు. గురువారం ఆ కార్యాలయంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు నాగమల్లయ్య, నగర కార్యవర్గసభ్యులు మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి

కడప నాగరాజుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ అన్నారు. విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనరు ఆదేశాల మేరకు గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం - కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ కె.పృథ్వీరాజ్ మాట్లాడుతూ యువత చేస్తున్న పొరపాట్లపై వివరించారు. రాష్ డ్రైవింగ్, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియా తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఎస్.నూర్జహాన్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాజారావు, స్టెప్ మేనేజరు వీవీ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీమా ప్రీమియం చెల్లింపులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైసీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లె తహసీల్దార్ హరినాథ్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. 1బి, అడంగల్ తీసుకెళ్లి మీసేవకు వెళితే ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు చూపడం లేదని మీసేవ సిబ్బంది తెలిపారన్నారు.

ఈశ్వర్‌రెడ్డికి పురస్కారం

కడప నాగరాజుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డికి తుమ్మల సీతారామయ్య సాహితీ పురస్కారం అందిస్తున్నట్లు ఏపీ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 సంవత్సరానికి ఈశ్వర్‌రెడ్డిని ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ నెల 7న గుంటూరులో రూ.5వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తామని తెలిపారు.

రోడ్డునే అద్దెకిస్తున్నారు!

● ట్రాఫిక్‌కు ఇబ్బందులు... ● బాడుగల రూపంలో అక్రమంగా వేలాది రూపాయల వసూళ్లు



నందిమండలంలో ఇళ్లు, దుకాణాల బయట ఏర్పాటు చేసిన చిల్లర కొట్లు... అడ్డంగా ఉన్న ఆటోలు

పెండ్లిమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీరు ఎక్కడైనా సొంత ఇంటిని బాడుగకు ఇవ్వడం, కాంప్లెక్స్ అయితే వాణ్యి అవసరాలకు అద్దెకు ఇవ్వడం చూసి ఉంటారు. అంతే కాదు.. ఖాళీస్థలాలను కూడా అద్దెకిస్తుంటారు. అయతే కొందరు ఏకంగా ప్రభుత్వ రోడ్డునే అద్దెకిచ్చేసి నెలకు వేలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. కడప-పులివెందుల రహదారి మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి, నందిమండలం గ్రామాలలో ఆక్రమణకు గురవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెండ్లిమర్రి మడలంలోని నందిమండలం, వెల్లటూరు ఆమ్రాలలో గృహాలు, దుకాణాదారుల ఇళ్ల ముందు ఉన్న ప్రభుత్వ రోడ్డుకు బాడుగ వసూలు చేస్తున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. నందిమండలం, వెల్లటూరు గ్రామాలలో కడప-పులివెందుల ప్రధాన రహదారి ఉంది. ఈ గ్రామాలు మండలానికి మంచి కూడలి కావడంతో వ్యాపారాలకు అడ్డాగా మారింది. అక్కడ ఫ్యాన్సీ స్టోర్లు, తినుబండారాల షాపులు వెలిశాయి. ఇక్కడ వ్యాపారానికి మంచి డిమాండ్ ఉండటంతో కొందరు ఒకడుగు ముందుకేసి ఇంటి ముందు, దుకాణాల ముందు ఉన్న రహదారిని పండ్లు, పూలు, తినుండారాల నిర్వాహకులు అద్దెకిచ్చేశారు. రూ.200 నుంచి రూ.300 వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.6వేలు, రూ.7వేలు వసూలు చేస్తున్నారు. ఉత్త పుణ్యానికి నెలనెలా అద్దె వసూలు చేస్తుండటంతో చాలా మంది రహదారిని ఆక్రమించేసి అద్దెకిస్తున్నారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కడప-పులివెందుల నాలుగు వరుసల రహదారి స్థలాలు ఆక్రమించి రెండు వరుసలుగా మారిందనే విమర్శలున్నాయి. ఆదివారం వచ్చిందంటే నందిమండలం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన మాంస పు అంగళ్లు ఏర్పాటు చేస్తుండటంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బం దులుపడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం, ఆటో లు నిలిపేందుకు ప్రత్యేక స్టాండు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టిసారించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

'ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయం'

కడప రూరల్, డిసెంబరు 5(అంధ్రజ్యోతి) :ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటుచేయడం శోచనీయమని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు ఆరోపించారు. కడప న్యాయవాదుల సంఘం సమావేశ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమకు నడిబోడ్డున గల కడపలో ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయకపోడం సబబుకాదన్నారు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం కేసుల సంబంధిత కోర్టులు తిరుపతిలో పెట్టడం వలన అక్కడి పవిత్రత దెబ్బతింటుందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెనడి, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ ఉన్నారు.

బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుందని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పీవీఎస్.వి.ప్రసాద్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వేంపల్లెలో ఆయన గురువారం మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్లలో ఇస్తున్న సబ్సిడీ రుణాలు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు కూడా ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సికెదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేలల దినోత్సవం ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పరీక్షించు, పర్యవేక్షించు యాజమాన్యం నేపథ్యంలో ప్రపంచ నేలల దినోత్సవం జరుపుకుంటామన్నారు. భూసార పరీక్షల మేరకు పంటల సాగు, ఎరువుల యాజమాన్యంలో సూచనలు పాటించాలన్నారు. వ్యవసాయ, పండ్లతోటల సాగులో భూసార పరీక్ష అనుగుణంగా రైతులు సాగు చేసుకోవాలని, రసాయనిక ఎరువులు తగ్గించడంతోపాటు సేంద్రియ ఎరువులు వాడకం వలన భూసార సమతుల్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

ఎయిడెడ్ పోస్టుల అవకతవకలపై విచారణ జరిపించాలి



వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ బాలుర ఎయిడెడ్ పాఠశాలల్లో జరిగిన ఎయిడెడ్ పోస్టుల భర్తీలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్జేడీ కార్యాలయం వద్ద కార్యాలయం ఏడీ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. విద్యాశాఖాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాలుర పాఠశాలలో పోస్టుల భర్తీపై సమగ్ర విచారణ జరిపించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కన్వీనరు విజయ్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

కడప మారుతీనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కడపలో గల ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించే ప్రక్రియను ఆపేయాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు రఘునాథరెడ్డి, లక్ష్మీరాజా ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడపలో ఏపీజీబీ పూర్తి సౌకర్యాలతో రాయలసీమ ప్రజలకు సేవలందిస్తోందన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించకుండా ప్రజల సేవలో కొనసాగించాలని కోరారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తిరుచానూరులో పద్మావతి అమ్మవారి కార్తీక మాస ఉత్సవాల్లో వేంపల్లెకు చెందిన చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. వేంపల్లెకు చెందిన కవి డ్యాన్స్ అకాడమీ బృందం పది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో తమ ప్రదర్శన చేశా రు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 15 బృందాలురాగా వేంపల్లెకు చెందిన చిన్నారుల బృందం కోలాట నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయాలి

వల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయాలని జిల్లా ఎయిడ్స్, టీబీ లెప్రసీ ఆఫీసరు డాక్టర్ రవిబాబు అన్నారు. గురువారం వల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక డాక్టరు ఫణీంద్రతో సమావేశం నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంటువ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు న్యూమోనియా రాకుండా ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు, ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. స్థానిక డాక్టరు ఫణీంద్ర, సీహెచ్ఓ వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు బహుమతులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :కడప నగరం ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగ పిల్లలకు క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడల్లో విజేతగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. కడప అల్‌షిఫా మానసిక దివ్యాంగుల కేంద్రం పిల్లలు ఎక్కువ మంది బహుమతులు సాధించారని సంస్థ వ్యవస్థాపకులు మహ్మద్‌రఫి తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో ఆనందం కనిపించిందన్నారు.

దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో వేంపల్లె కేంద్రం విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఐఈఆర్టీ యశోద తెలిపారు. కడప ఏడీ కృష్ణకిషోర్ అధ్యక్షతన కడప ఇండోర్ స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించగా రాజ్‌కుమార్, చందు, విష్ణు, హర్షవర్దన్, వెంకటతేజ, రవళి, సిద్ధిక్‌బహుమతులు సాధించారన్నారు.

టీడీపీ అభివృద్ధికి కృషి చేయండి

వేంపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వచ్చిన పదవితో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్‌కు సూచించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను గురువారం కలిశారు. పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం, గిరిజనుల కోసం కృషి చేస్తానన్నారు.

ఘనంగా శ్రీనివాసులు జన్మదిన వేడుకలు



చైర్మన్ శ్రీనివాసులును దుశ్శాలువాతో సన్మానిస్తున్న రామాంజనేయులు, బండిబాబు తదితరులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మద్రాసు రోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీలో గురువారం సాయంత్రం శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు 74వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.హరి ప్రసాద్, మెంటా సుబ్బరాయుడు, విజ్ఞాన్ సురేష్, బండి బాబు, పరంధామయ్య, స్వామి సెక్యూరిటీస్ మేనేజింగ్ డైరెక్టర్ ముమ్మడి రా మాంజనేయులు, చలపతి, పొత్తపి పెంచలయ్య తదితరులు శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలిపారు.

చలో కడప బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జయరాజ్‌గార్డెన్స్‌లో ఈనెల 15న జరిగే చలో కడప కార్యక్రమ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, జమాయత్ ఉలుమా హింద్ పెద్దలు అమిద్‌హుసేన్ గురువారం పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై కలెక్టరుతో చర్చించారు. బుకారి, అబ్దుల్ రాయల్ కరీం, నాసర్ అలీ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని రేషన్ షాపులు, రైస్ మిల్లులను విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నాయని ఇటీవల దుమారం రేగుతుండడంతో విజిలెన్స్ అధికారులు జవహర్, బాలగంగాధర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్‌లు గురువారం తనిఖీలు నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ సంచాలకులు నరసింహారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లెలో కందిపంటను ఏఓ శ్యామ్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుధ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు 5 ఎకరాల సానుభూమి ఇవ్వాలని ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ ఈ నెల 9న జమ్మలమడుగులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శులు మెనెయ్య, శంకర్‌నాయక్, దళిత డప్పు కళాకారుల సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

● వివిధ ప్రాంతాల్లో నిరసనలు



కడప: మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి... చెన్నూరులో ఉపాధ్యాయ సంఘాల నిరసన... జేసీకి వినతిపత్రం అందిస్తున్న ప్యాప్టో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటిలో మృతిచెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అహ్మద్‌కు గురువారం రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 9వతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులపై దాడి చేశారని ఆయన బంధువులు, మృతుని భార్య ఆరోపిస్తున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ మరిచినప్పుడు ప్రధానోపాధ్యాయుడు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ జరపకపోవడం విచారకరమన్నారు. ఈ సంఘటనలో బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు వీఆర్‌రెడ్డి, రమణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రావు, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: అహ్మద్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం చెన్నూరు ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

సీకేదిన్నె: అహ్మద్ మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలని ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, రమాదేవి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనరు తిరుపాల్ డిమాండ్ చేశారు. గురువారం సీకేదిన్నె మండలం ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. వివిధ సంఘాల నాయకులు బాలిరెడ్డి, కేదార్‌నాథ్, నారాయణరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పులివెందుల: రాయచోటిలో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహమ్మద్ మృతికి కారణమైన వారిపట్ల కఠిన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రమణప్ప సత్రం ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలి

ఉపాధ్యాయుడి అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్టీయే జిల్లా అధ్యక్షుడు కేవీ రామక్రిష్ణంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు,ఎస్‌టీపీ నాయకులు కె.రవీంద్ర, అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతి పట్ల సమగ్రవిచారణ జరపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో...

ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారికి కఠినంగా శిక్షించాలని ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అహ్మద్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు సలాం, శ్రీరాం, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతికి కారకులైన వారిని శిక్షించాలని ప్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ జేసీ చాంబరులో జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఏపీటీఎఫ్ ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ 1938 అబ్దుల్లా, బీటీఏ జ్యోతి రామచంద్రబాబు, యూటీఎఫ్ కె.నరసింహారావు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి గురువారంఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అహ్మద్ మృతిపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా కోరారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పెండ్లిమర్రి: అహ్మద్ మృతిపై ఎగువపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాంతియుత నిరసన తెలిపారు. ఉపాధ్యాయులకు పనిచేసే చోట భద్రత కల్పించాలన్నారు. ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్, సీనియర్ ఉపాధ్యాయులు సలీం, కొండయ్య, కేశవులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కుపరిశ్రమ నిర్మించాలి



బద్వేలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బద్వేలులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉక్కు సాధన ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉక్కు సాధన ఐక్య వేదిక పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కడప ఉక్కుపరిశ్రమ అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కు శాఖా మంత్రి ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, అనంతమ్మ, వికలాంగుల సంఘం అధ్యక్షుడు వెంకటపతి, కళాకారుల సంఘం నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కడప స్టీలు ప్లాంటు కేంద్రం పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించడం దుర్మార్గమని సీపీయం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. గురువారం అంబేద్కర్ సర్కిల్ సీపీయం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీయం నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ఉక్కుకోసం ఎంపీలు రాజీనామాలు చేసి అయినా సాధించాలని జమ్మలమడుగులో సీపీఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగం శివమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, తదితర నేతలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య తమ వద్ద లేదని నిర్లక్ష్యంగా మాట్లాడడం కూటమి ప్రభుత్వాలకు సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు నరేంద్ర, వినయ్, దస్తగిరి, మునెయ్య, శ్రీనాథ్, మర్రి ప్రకాశం, బాష, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ముందస్తు వైద్య పరీక్షలు ప్రజలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం తాళ్లమాపురం, బొల్లవరం, లింగారెడ్డికొట్టాలు, కొర్రపాడు, ఎస్‌వీవీ బాయిస్ హైస్కూలులను ఎన్‌సీడీసీసీ, క్యాన్సర్, చైల్డ్ హెల్త్ స్కీనింగ్ సర్వేలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ప్రభుత్వం బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తోందన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని, అందరూ చేయించుకోవాలని తెలిపారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వలన వ్యాధులను గుర్తించి తగిన చికిత్సలు తీసుకుని నయం చేసుకోవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌పీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, వైద్యులు శివప్రసాద్‌రెడ్డి, భరత్‌నారాయణ, హిమబిందు, శ్రీనివాసులు, నిఖిల, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఖాజామొహిద్దీన్, సీహెచ్‌వో కృష్ణమ్మ, సీవో సుబ్బారెడ్డి, ఏఎన్ఎం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అతలాకుతలం

భారీ వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలు ● తుఫాన్ ప్రభావంతో నేలవాలిన వరి ● నీట మునిగిన పైర్లు ● ఆదుకోవాలని రైతుల వినతి



జీకోడూరు... అయ్యవారుపల్లె గ్రామంలో నీటిలో మునిగిన వరిని కట్టలు కట్టుకుంటున్న రైతులు

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం దాకా భారీ వర్షం కురిసింది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో విధంగా వర్షం అందరిని ఇబ్బంది పెట్టింది. అకాల వర్షంతో రైతన్నలు ఆందోళనలో పడ్డారు. ఇటీవల అల్పపీడనం, తుఫాన్ కారణంగా రైతన్నలు పూర్తిగా నష్టపోయారు. మైలవరం, పెద్దముడియం తదితర మండలాల్లోని గ్రామాల్లో వర్షంతో పంట పొలాల్లో నీరు నిలిచాయి. ప్రధానంగా ఎస్.ఉప్పలపాడు దారిలో గుండ్లకుంట వరకు పలు ప్రాంతాల్లో జొన్న, శనగ తదితర పంటల్లో వర్షపునీరు నిలిచింది. బైపాస్‌రోడ్డు నుంచి రైల్వేస్టేషన్, గొరిగెనూరు, ధర్మాపురం, చలివెందుల, దేవగుడి, పి.సుగుమంచిపల్లె తదితర గ్రామాల గుండా వరి పొలాలు పూర్తిగా నేలవాలాయి. కొన్ని చోట్ల వరి ధాన్యం మొసులు వచ్చి నల్లగా మారి వరి పంట దెబ్బ తింది. బైపాస్ రోడ్డు పక్కన గొరిగెనూరు మధ్య రైతులు కోత కోసిన వరి ధాన్యం పట్టలు కప్పి పెట్టారు. పంట పొలాల్లో నీరు ఎప్పుడు ఆరిపోతుందో, వరి పంట చేతికొచ్చేది ఏమీ లేదని కొందరు రైతులు కంటతడి పెట్టారు.

రాజుపాలెం..: మండల పరిధిలోని వెలవలి,టంగుటూరు, కొట్టాల తదితర గ్రామాల్లో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలవాలింది. గురువారం ఏవో శివరామక్రిష్ణా రెడ్డి నేలవాలిన వరి పంటలను పరిశీలించారు. మండలంలో 712 ఎకరాలు నీట మునిగినట్లు ఆయన తెలిపారు. అయితే ఈ వర్షం శనగపంటకు ఊరటనిచ్చింది.

బి.కోడూరు..: బి.కోడూరు మండలంలో వారం రోజుల నుంచి కురుస్తున్న తుఫాన్ కు కోతకు వచ్చిన వరి పైరు తీవ్రంగా దెబ్బతింది. బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో కోత దశలో ఉన్న వరి పూర్తిగా మునిగింది. అధికారులు పరిశీలించి పరిహారం అందించాలని రైతులు వాపోయారు.కాగా మండల పరిధిలోని అయ్యవారుపల్లె గ్రామంలో వరి చేనును ఏవో కౌశిక గురువారం పరిశీలించారు.

పోరుమామిళ్ల..: బుధ, గురువారాలు పోరుమామిళ్లలో కురిసిన వర్షానికి మండలంలో చాలా గ్రామాల్లో పైర్లలో నీరు నిల్వ ఉండడం తో రైతన్నలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని అగ్రహారంలో అగ్రహారం చిన్నాయపల్లె, సిద్దవరం ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంట నీట మునగడంతో రైతులు ఆవేదన చెందు తున్నారు. అలాగే పుల్లీడులో వర్షం కారణంగా దాదాపు 70 ఎకరాల్లో మిరప వర్షం నీటిలో మునిగిపోయింది.కాగా మినుము, ఉల్లిలో వర్షం నిలిచినట్లు రైతులు పేర్కొన్నారు. కాగా పోరుమామిళ్ల రహదారులు నీటి కుంటలను తలపించాయి. ముఖ్యంగా పోరుమామిళ్లలోని సాయిబాబా దేవాలయం వద్ద వర్షంనీరు చేరి నీటి కుంటను తలపించింది. అలాగే మైదుకూరు రోడ్డులో రోడ్లపైనే మోకాలిలోతులో నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బం దులకు గురయ్యారు. అలాగే బద్వేలు రోడ్డులో కమ్మవారిపల్లె సమీపంలో రోడ్డు గుంతలు పడడంతో ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దువ్వూరు..: దువ్వూరు మండలంలోని రైతులను అకాల వర్షం కంటతడిపెట్టిస్తోంది. ప్రధానంగా వరి, మినుము, ఉల్లి పంటలు సాగుచేసిన రైతుల నెత్తిన పిడుగుపడ్డట్టుచేసింది. బుధవారం రాత్రి దువ్వూరు మండలంలో 58.2 మి.మీ. వర్షం నమోదు అయింది. గురువారం కూడా ఇలాగే కొనసాగింది. అక్కడక్కడ తొలగించిన వరి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయగా అవి తడిసిపోయాయి. మండలంలోని చాలా గ్రామాల్లో జొన్నసాగు చేసిన పొలాల్లో నీరు నిలిచింది.

చాపాడు..: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల పరిధిలోసాగు చేసిన వరి పైరు సుమారు వెయ్యి ఎకరాల్లో నేలకొరిగింది. ఇలా పడిపోవడంతో వరి దాన్యం దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లక్ష్మిపేట, సోమాపురం, చిన్నగురవలూరు, పల్లవోలు, అన్నవరం, తదితర గ్రామాల్లో సుమారు 26 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేశారు. ప్రస్తుతం వరి పైరు కోత దశకు చేరుకుంది. నేడో రేపో కోతలుకోసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి సమయంలో భారీగా వర్షం కురింది. దీంతో వరిపైరు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులునేలకొరిగిన వరి పైరును చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కష్టపడి పండించిన తర్వాత చేతికొచ్చే సమయంలో నేలపాలవుతోందని ఆందోళన చెందుతున్నారు.

కాశినాయన..: మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికి శనగ, మిరప,వరి పొలాలల్లోని నీరు భారీగా నిలిచింది. వడ్డమాను కొండ్రాజుపల్లె,కోడిగుడ్లపాడు తదితర ప్రాంతాల్లో నీరునిలిచిన శనగ పంటలను ఏవో విజయలక్ష్మీ పరిశీలిం చారు. భూమిలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున ఎండు తెగులు,వేరుకుళ్ళు తెగుళ్ళు వచ్చే అవకాశం ఉందని వాటి నివారణకు 1లీటరు నీటిలో టెబుకోనోజోల్ 2 ఎంఎల్, 19-19-19 లు 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాగా నర్సాపురం నుంచి ఉప్పలూరుకు వెళ్లేదారిలో ఉన్న ఉప్పాగులో నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రెండు గ్రామాల మధ్య గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రొద్దుటూరు రూరల్..: ప్రొద్దుటూరు మండల పరిధిలో కోతకు వచ్చిన వరి పంట సుమారు 350 ఎకరాల్లో దెబ్బతింది. గురువారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డి, వీఏఏ సురేష్ దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. మండల పరిధిలోని కామనూరు, చెన్నమరాజుపల్లె, కల్లూరు, తాళ్లమాపురం, కొత్తపల్లి ప్రాంతాల్లో కోత దశకు వచ్చిన వరి పొలాలు నేలవాలాయి. నేలవాలిన పంట మొలకెత్తకుండా ఉండేందుకు లవణ ద్రావణాన్ని పిచికారీ చేయాలని, పొలాల్లో నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు గట్లను తొలగించాలని ఏవో శివశంకర్‌రెడ్డి రైతులకు సూచించారు. దెబ్బతిన్న పంట వివరాల నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

ఖాజీపేట..: ఈనెలలో వచ్చిన వర్షానికి మండల పరిదిలో వరి, మినుము పంటలు దెబ్బతిన్నాయని ఏవో నాగార్జున అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో 612 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందని ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు వెంటనే ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు.



జమ్మలమడుగులో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో



పోరుమామిళ్ల... పుల్లీడులో నీట మునిగిన మిరప



దువ్వూరులో...



చాపాడులో...



ప్రొద్దుటూరులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ



ఖాజీపేటలో...



జమ్మలమడుగులో...



కాశినాయన..ఉప్పలూరు నర్సాపురం గ్రామాల మధ్య ఉప్పాగులో నిలిచిపోయిన రాకపోకలు

సీఎం దృష్టికి బీసీ ఉపకులాల సమస్యలు



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న గోవిందు

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగుకు చెందిన టీడీపీ నాయీబ్రాహ్మణ కడప జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు గజ్జెల గోవిందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లినట్లు ఆయన గురువారం సాయంత్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయడును కలిసి వినతిపత్రం అందించానన్నారు. రాబోయేరోజుల్లో బీసీలకుమరిన్ని అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తిచేశానన్నారు.

'విభిన్న ప్రతిభావంతులకు కామిశెట్టివెంకటన్‌ను ప్రచారకర్తగా నియమించాలి'



చంద్రబాబుతో మాట్లాడుతున్న వెంకట్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ప్రచారకర్తగా కామిశెట్టి వెంకట్‌ను నియమించాలని ఆయన తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణయ్యల గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామిశెట్టి వెంకట్ పుట్టుకతో ఆర్టిజం, హైపర్‌యాక్టివ్, మానసిక వైకల్యం సమస్యలతో చర్చించారన్నారు. డాక్టర్ల సలహాలు, తల్లిదండ్రుల సాధన, గురువుల సహకారంతో వెంకట్ విభిన్న ప్రతిభావంతుడుగా తీర్చిదిద్దబడ్డారని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రేరణ కల్పించడానికి ప్రభుత్వం వెంకట్‌ను ప్రచారకర్తగా నియమించి ప్రోత్సహించాలని కోరారు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

బద్వేలు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి జరగబోయే రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో భూతగాదాలు, రీసర్వే, అవకతవకలను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు.

విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడవద్దు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చాపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల రక్షణకు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగిస్తున్నందున భూమి మీద కొన్ని రకాల జీవరాశులు చనిపోతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా లక్ష్మిపేట గ్రామంలో గురువారం సాయంత్రం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు శక్తివంతమైన పురుగు మందులు వాడుతుండడంతో మనం తినే ఆహారం కూడా విషం అవుతుందన్నారు. వానపాములు, నత్తలు, పీతలు వంటివి నశించి ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుందన్నారు. రైతులు ఎరువులు, మందులు వాడకం చాలా వరకు తగ్గించాలన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు వాడితే పంటలు పండించుకోవచ్చన్నారు. మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, ఏవోలు మ్యాగి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు జమ్మలమడుగులో ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంకోసం శుక్రవారం జమ్మలమడుగులోని తాడిపత్రిరోడ్డులో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ప్రొద్దుటూరు డివిజన్ డీఈ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక అధ్యక్షుడు రిటైర్డు జడ్జి శ్రీనివాస అంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.


రైతాంగాన్ని ఆదుకోవాలి


పోరుమామిళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు నష్టపోయిప రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిరుపతిరెడ్డి కాలనీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతన్నకు సహాయం చేస్తామని పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోని రైతుల పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, అట్లూరు ప్రాంతాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు.

విచారణ జరిపించండి

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగుఆర్డీవో కార్యాలయంలో ఓ మహిళా ఉద్యోగిని అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గురువారం రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్, ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డీవో కార్యాలయం వద్ద మాట్లాడారు. డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్ల వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారన్నారు. కొత్తగా రేషన్‌డీలర్లకు గతంలో ఉన్నవారి పేర్లు మార్చి లైసెన్స్ ఇచ్చినదానికి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.5 వేలు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపించారు.

కొవ్వొత్తులతో ఉపాధ్యాయుల నిరసన





ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో బుధవారం ఉపాధ్యాయుడిని విద్యార్థులే హత్య చేయడం హేయమైన చర్య అని ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయుడి హత్యకు నిరసనగా కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎల్‌టీఏ నాయకులు గంగాధర్, శేఖర్, సాయికుమార్, ప్రసాద్, నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, షరీఫ్, పాములేటి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో గురువారం రాత్రి ఎస్టీయూ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా కొత్తపల్లి ఉర్దూ హైస్కూలు ఉపాధ్యాయుడి మరణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ముందుగా వారు ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దముడియం ఎంఈవో చౌడయ్య, ఎస్టీయూ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కుండా భాస్కర్, ప్రసాద్‌బాబు, శివరామిరెడ్డి, శివరాం, రాజశేఖర్, తదితర ఉపాధ్యాయ నేతలు పాల్గొన్నారు.

బద్వేలు..: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పట్టణం, కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎజాజ్ అహ్మద్‌ను అత్యంత దారుణంగా కొట్టి ఆయన మరణానికి కారకులైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారంమున్సిపాలిటీ పరిధిలోని చెన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయులు పెంచలయ్య, సుబ్బరాయుడు, వరలక్ష్మి, గౌస్ బాష, రామ్మోహన్, చంద్ర, సురేష్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: రాయచోటి కొత్తపల్లె ఉర్దూ హైస్కూలు ఉపాధ్యాయుడు అహ్మద్ మృతిని నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో గురవారం నిరసన తెలిపారు. ఫ్యాప్టో నాయకులు పుల్లయ్య, నూనెశ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, వారణాసి రవీంద్ర, సత్తార్, క్రిష్ణయ్య, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం కొత్తపల్లెలో ఉర్దూ ఉపాధ్యాయుడి మృతికి కారణమైన ఉన్మాదులను శిక్షించాలని ఖాజీపేట ఉపాధ్యాయులు అన్నారు. గురువారం మధ్యాహ్నం విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి మండల ఉపాధ్యాయులు బాలికోన్నత పాఠశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లె పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎజాజ్ అహ్మద్ మృతికి కారకులైన వారిని శిక్షించాలన్నారు.